ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణావతారంలో ఉన్న వేణుగోపాలస్వామిని పూజిస్తున్న భక్తులు


పారిజాతగిరిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


సీఎస్‌టీఎస్ కళాశాలలో ఉట్టి కొడుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు శ్రీకృష్ణుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామి వారికి నిత్య కైంకర్యాతో పాటు అర్చన అభిషేకాధి పూజలు చేశారు. రాత్రి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమ నిర్వహించారు. అర్చకులు లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈఓ ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.

● పారిజాతగిరిలో శ్రీకృష్ణ పెరుమాళ్‌కు విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు వేషధారణలతో అలరించారు. స్వామి వారికి విశేష ప్రసాదాలతో నివేదించారు. పూజా కార్యక్రమాలకు వాసవీ సాయి నగేష్ కుటుంబసభ్యులు ఉభయధారులుగా వ్యవహరించగా, ఆలయ అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు పూజలు చేసినట్టు ఆలయ ఈఓ మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్ పర్యవేక్షించారు. ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాలు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నామని, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని ఈఓ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో..

జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుక ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు కల్చరల్ ఈవెంట్స్‌పై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వివిధ రకాల కార్యక్రమాలను కళాశాలలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థి టి.దుర్గాప్రసాద్ (బీఏ) ఉట్టు కొట్టి రూ.500, రాధాకృష్ణుల ఫొటో ఫ్రేమ్‌ను గెలుపొందాడు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కళాశాల కల్చరల్ క్లబ్ కోఆర్డినేటర్ సీహెచ్ రమాదేవి, మెంబర్స్ జీవీ లాల్, పీఎస్ రావు, వి.హనుమంతరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం: కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు గురువారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాలను వాడవాడలా నిర్వహించారు. కొయ్యలగూడెం శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్ విగ్రహానికి 80 లీటర్ల పాలు, 65 కేజీల అటుకులతో అభిషేకించారు. రేపల్లెవాడ ఎంవీఆర్ విద్యా నికేతన్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని రాధాకృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టు విజేతలకు బహుమతి ప్రదానం నిర్వహించారు. రాజవరం, కన్నాపురం, గొల్లగూడెం, మహదేవపురం, తిమ్మనకుంట, బయ్యనగూడెం, నరసన్నపాలెం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బుట్టాయగూడెం మండలంలో..

బుట్టాయగూడెం: కృష్ణాష్టమి వేడుకలను బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది రెండు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలు రావడంతో గురువారం కూడా ఈ వేడుకలు చేసుకున్నారు. స్థానిక కొత్తపేటలో ఉన్న రాధాకృష్ణుల ఆలయాల వద్ద ఘనంగా నిర్వహించారు. అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కొత్తపేటకు చెందిన మహిళలు చేసిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యారోహిణీ డిజిటల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉట్టి కొట్టి సందడి చేశారు.


బుట్టాయగూడెం కొత్తపేటలో కోలాటం చేస్తున్న దృశ్యం

రుణాల మంజూరుకు ఏర్పాట్లు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో కౌలు రైతులకు ఎస్‌బీఐ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేశామని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. ఈ మేరకు మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ దత్తి రాంబాబుతో కలిసి ఎస్‌బీఐ మేనేజర్‌తో చర్చించామన్నారు. రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకుని బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులకు ఖరీఫ్ 2023 సీజన్ వ్యవసాయ పెట్టుబడులకు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. మండలంలో 2,500 మంది సాగు రైతులు ఉన్నారన్నారు. రైతులతో గురువారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడినట్టు చెప్పారు. కార్యక్రమంలో రైతులు సబ్రహ్మణ్యం, బాలాజీ, కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ సలహా మండలి సభ్యులు

ఫిజియోథెరపీ ద్వారా మస్క్యులర్ డిస్ట్రోఫీ నివారణ

ఏలూరు రూరల్: ఫిజియోథెరపీ ద్వారా మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధిని నివారించవచ్చని డాక్టర్ తివిక్రమ్ మోహన్ అన్నారు. గురువారం వరల్డ్ మస్కులర్ డిస్ట్రోఫీ డే సందర్భంగా జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జన్యుపరంగా సంక్రమించే మస్కులర్ డిస్ట్రోఫీకి మందులు కనుగొనలేదని తివిక్రమ్ మోహన్ తెలిపారు. తల్లిదండ్రుల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. దీనిపై అవగాహన పెంచుకుని ఫిజియోథెరపీ ద్వారా వ్యాధి నయం చేసుకోవచ్చని సూచించారు. దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరిపీ తదితర సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మణి పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆసుపత్రిలో మస్కులర్ డిస్ట్రోఫీ అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు రూరల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శర్మిష్ఠ అన్నారు. గురువారం మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మలేరియా ఇన్‌స్పెక్టర్ దుత్తి వేణుగోపాలస్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్, సిబ్బంది కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌ఓను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శర్మిష్ఠ మాట్లాడుతూ నగరంలో మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సహకారంతో సీజనల్ వ్యాధులను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఇందుకోసం చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.


డీఎంహెచ్‌ఓ శర్మిష్ఠను కలిసి మలేరియా నివారణ అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం


అన్నేవారిగూడెంలో అవార్డు గ్రహీత మస్తాన్ మాస్టార్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు


దెందులూరులో వి.వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

భీమడోలు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్‌కే మస్తాన్ సేవలు ప్రశంసనీయమని దుద్దేపూడి పంచాయతీ సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పాల్నాటి శ్రీనివాస్‌లు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెం ప్రీ హైస్కూలు హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ జిల్లా ఉత్తమ అవార్డును, అదే పాఠశాలకు చెందిన దుర్గాప్రసాదిని మండల స్థాయి అవార్డులను అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాలలో వారికి పౌరసన్మానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాల్నాటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ తరుణంలో చిన్నారులు తమకు ఇష్టమైన టీచర్ అనుకరిస్తూ పాఠాలను వల్లించి చూపరులను ఆకట్టుకున్నారు. అనంతరం అవార్డు గ్రహీతలతో పాటు ఉపాధ్యాయులకు దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, విజయకుమారి, జ్యోతిబసు, ఝాన్సీ, శారదాణి, రవికుమార్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటలక్ష్మికి ఘన సత్కారం

దెందులూరు: దెందులూరు మండల ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత వి.వెంకటలక్ష్మి బోధనా సామర్థ్యం, సమన్వయం, ప్రణాళిక, అభినందనీయమని దెందులూరు ఎంఈఓలు ఏపీఎస్‌వీ ప్రసాద్, అన్నమ్మ అన్నారు. గురువారం దెందులూరు ప్రాథమిక పాఠశాల–1 హెచ్‌ఎం వీ.వెంకటలక్ష్మిని ఎంఈఓలు, ఉపాధ్యాయులు లక్ష్మిభాయి, శ్యామ్‌ప్రసాద్, ఎండీఎం, పేరెంట్స్ కమిటీ సభ్యులు శాలువా, పూలదండలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మాతా శిశు సంక్షేమ శాఖ భీమడోలు పీఓ కేవీ విజయలక్ష్మీ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతుల విద్యార్థినులకు గురువారం బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. దిశా వన్ స్టాప్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన పీఓ కేవీ విజయలక్ష్మీ మాట్లాడారు. బేటి బచావో బేటి పడావో నినాదం ప్రతి ఇంటికి చేరాలన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం వివాహ వయస్సు యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 వయస్సు అన్నారు.

అభివృద్ధిపై అసత్య ప్రచారం తగదు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఎల్లో మీడియా చేస్తోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, పెదయాగనమిల్లి సర్పంచ్ బలే నాగసులోచన, వడ్డీ కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్ సీపీ శ్రీపర్రు నాయకుడు సైదు వజ్రం, పీఆర్ ఏఈ కృష్ణమోహన్, ఎంఈఓ–2 ఆర్ రంగయ్య తదితరులు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిశారు. అభివృద్ధి పనులు, పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి చాటపర్రులో ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి, పైప్‌లైన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర అభివృద్ధి పనులు చేసినప్పటికీ పలు పత్రికల్లో గోతులమయమైన రోడ్డు చూపుతూ కథనాలు ప్రచురిస్తున్నాయని వాపోయారు. ఎంపీపీ స్పందిస్తూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో గ్రామాల్లో సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.4 కోట్లు రూర్బన్ నిధులు విడుదల చేసిందన్నారు. ఇందులో చాటపర్రులో రూ.75 లక్షలతో 9 సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తారని తెలిపారు. టెండర్లు ఖరారయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఏఈ కృష్ణమోహన్ చెప్పారు. స్థానిక జెడ్పీ పాఠశాల తరగతి గదులు నిర్మాణ పనులు వేగవంతం చేస్తానని ఎంఈఓ రంగయ్య తెలిపారు. శ్రీపర్రు, పెదయాగనమిల్లి భూ సమస్య పరిష్కరించేందుకు సహకరించాలని శ్రీపర్రు పెద్దలు ఎంపీపీని కోరారు.


ఎంపీపీ శ్రీనివాసరాజుకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

బాధితులకు న్యాయం చేశాకే నిర్మాణాలు

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల సహకారం అవసరమని, బాధితులకు న్యాయం చేశాకే నిర్మాణ పనులు చేపడతామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏలూరు మార్కెట్ యార్డ్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణలో ఇళ్లు కోల్పోతున్న పలువురితో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాని గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. 50వ డివిజన్‌కు చెందిన సుమారు 80 కుటుంబాల ప్రజలను ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానిని కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలో పెరుగుతోన్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. మార్కెట్ యార్ట్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో నగర ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు సమీపంలోనే స్థలాలు కేటాయింపుతోపాటు ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే నాని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం చేసేందుకు అందుబాటులోని స్థలాల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసాకే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే నాని తెలిపారు. సమావేశంలో ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్, తదితరులు ఉన్నారు.


క్యాంపు కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

భీమడోలు: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం ద్వారా భూ సమస్యలు శాశ్వత పరిష్కారమవుతాయని ఏలూరు జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి పూర్ణచంద్రశేఖర్ అన్నారు. కోడూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జిల్లా శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన సచివాలయ గ్రామ కార్యదర్శులకు రెండో విడత వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకపు సర్వేపై వారికి శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామస్థాయిలో పర్యటనకు విచ్చేసిన గ్రామ కార్యదర్శులకు స్వమిత్వపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డీఎల్‌పీవో పూర్ణ చంద్రశేఖర్, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవిలు పాల్గొని వారికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలకు ఈ సర్వేతో చెక్ పడుతుందన్నారు. భూ తగదాలను పరిష్కరించి వారికి శాశ్వత పట్టాను అందించడం ద్వారా వారికి మేలు జరుగుతుందన్నారు. జిల్లాలోనే కోడూరుపాడులో పూర్తి స్థాయి సర్వే పూర్తి అయ్యిందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ విధానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. తొలుత గ్రామ కార్యదర్శి వెజ్జు ధర్మా సర్వేపై శిక్షణ అందించారు. వారి అనుమానాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఎం.ముత్తయ్య, జిల్లాలోని గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


కోడూరుపాడులో గ్రామకార్యదర్శులకు స్వమిత్వపై శిక్షణ అందిస్తున్న అధికారులు

మత్తు మందు వికటించడంతో పరిస్థితి విషమం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు వెళ్లిన మహిళకు వైద్యులు సరిగా మత్తు ఇంజెక్షన్ చేయకపోవడంతో ఆకస్మాత్తుగా కూలబడింది. ఆమెను వెంటనే ఐసీయూలో చేర్పించారు. ఆమె వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. చింతలపూడి మండలం రేచర్లకు చెందిన వరిగంటి మాణిక్యం(52) కంటి చూపు తగ్గడంతో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి వెళ్ళారు. వైద్యులు పరీక్షించి కంటిలో శుక్లాలు ఉన్నాయని, ఏలూరు జీజీహెచ్‌కు వెళితే ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని చెప్పారు. చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన కంటి ఆపరేషన్లు చేయించుకునే వారిని ఈనెల 6న ఏలూరు ప్రభుత్వాసుపత్రి కంటి విభాగానికి చెందిన మినీబస్సులో బుధవారం మధ్యాహ్నం తీసుకువచ్చి వార్డులో చేర్పించారు. గురువారం ఉదయం వైద్యులు ఆపరేషన్లు ప్రారంభించి నలుగురు వ్యక్తులకు ఆపరేషన్లు పూర్తి చేశారు. ఐదో ఆపరేషన్ మాణిక్యానికి చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్ళి మత్తుమందు ఇచ్చారు. మత్తు మందు వికటించి ఆమె కిందపడిపోయారు. హాస్పిటల్‌లోని ఐసీయూలో ఉదయం 11.40 గంటలకు చేర్చారు. మాణిక్యం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఆమె బంధువులు ఐసీయూలో ఆందోళన చేపట్టారు. టూటౌన్ పోలీసులు హాస్పిటల్ వద్దకు చేరుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే అభివృద్ధి

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండాలని తద్వారానే అభివృద్ధి, దేవుని దీవెనలు లభిస్తాయని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. గురువారం వేగవరంలో స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ.మోజెస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామస్తులు, ఆర్‌సీఎం సంఘస్తులు సహకారంతో వేళంగిణి మాత ఉత్సవాలు నిర్వహించారు.

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ


బోడిగూడెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం దిప్పకాయలపాడు, బోడిగూడెం పంచాయతీల పరిధిలో నిర్వహించారు. సర్పంచ్‌లు సున్నం శాంతికుమారి, కడగట్ల గడ్డియ్యల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్ కార్డులను అందజేశారు. సుమారు 100కు పైగా పెన్షన్ కార్డులు పరిశీలనలో ఉన్నాయని, మండల పరిషత్ అధికారులు పర్యవేక్షించి, వాటిని కూడా త్వరలోనే మంజూరు చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు.

వ్యాసరచన, క్విజ్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా సంస్థ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగట్ల నాగేశ్వరరావు విద్యార్థులకు, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులు శొంఠి నాగశివాని, రాఘవరాజు అక్షయ గంగాభవాని, ఊసా శరణ్య, పెనుమాకుల కుమారి, కాళ్ల మోహన జయసూర్యకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. టాటా వంటి ప్రముఖ సంస్థ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఉపయోగించుకోవాలని టాటా సంస్థ ప్రతినిధి నల్లాన్ చక్రవర్తుల సందీప్ కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం


కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించిన దృశ్యం

టి.నరసాపురం: గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘం చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి రాంబాబు అన్నారు. గురువారం టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 90 రోజులపాటు శిక్షణ కేంద్రంలో అన్నిరకాల కుట్లు నేర్పిస్తారని తపన వలంటీర్ గణేష్ అన్నారు.

మానిటరింగ్ మెంబర్‌గా గుర్రాల


నియామక పత్రం అందుకుంటున్న రవికుమార్

కామవరపుకోట: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్‌గా కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన గుర్రాల రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాలను సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ సమక్షంలో గురువారం ఆయన అందుకున్నారు. జిల్లాలోని దళితులు, గిరిజనులపైనా జరిగే దాడుల్లో బాధితుల పక్షాన నిలబడి వారికి సత్వర న్యాయం జరిగేలా, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవికుమార్ తెలిపారు. తనకు సహకరించిన ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు, ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం


వేడుక నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

జంగారెడ్డిగూడెం: బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ ఫౌండేషన్ సెలబ్రేషన్ జంగారెడ్డిగూడెం బ్రాంచ్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ టి.ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఖాతాదారులకు సేవలందిస్తూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. రైతులకు బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బ్రాంచ్ ఖాతాదారులకు ఉన్నత సేవలు అందిస్తూ అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

ద్వారకాతిరుమల: స్థానిక కాపు కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల మండల సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) పాల్గొంటారని పేర్కొన్నారు. శ్రేణులంతా హాజరుకావాలని కోరారు.

నిల్వ మాంసం విక్రేతపై కేసు


పీరూ మటన్ షాపుల్లో నిల్వ ఉంచిన మాంసం

జంగారెడ్డిగూడెం: నిల్వ ఉంచిన మాంసం అమ్ముతున్న మటన్‌షాపు యజమానిపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పీరూ మటన్‌షాపులో నిల్వ ఉంచిన మాంసం అమ్ముతున్నారని తమకు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసినట్టు ఎస్సై చెప్పారు. షాపును తనిఖీ చేయగా, నిల్వ ఉంచిన మేక, గొర్రె మాంసం వినియోగదారులకు అమ్ముతున్నట్టు గుర్తించామన్నారు. షాపు పరిసరాల్లో పరిశుభ్రత లేకుండా కాలుష్యం వెదజల్లుతోందని చెప్పారు. దీంతో షాపు యజమాని షేక్ పీరూ సాహెబ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

సంతాన వేణుగోపాల స్వామికి పూజలు


గరుడవాహన సేవలో సంతాన వేణుగోపాల స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి దేవస్థానం దత్తత క్షేత్రమైన నగరంలోని తూర్పువీధి సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. స్వామి వారికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజ నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి గరుడ వాహన సేవ, స్వామివారికి, అమ్మవారికి కోవెలలో ప్రాకారోత్సవం, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు.